నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: ఎన్‌జీఓస్ కాలనీ ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేఎల్‌ఆర్ ఫేజ్–1, ఫేజ్–2, ఫేజ్–3, శ్రీకాలనీ, కిష్టాపూర్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి


విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న దృశ్యం

కీసర: ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు చీర్యాల గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ శశిధర్ అన్నారు. సోమవారం కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఓదయ్య, కిషోర్‌లు కరీంగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులను అందజేశారు. కరీంగూడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.శ్రీధర్, ఉపాధ్యాయులు పి. సుధాకర్, జి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఘట్‌కేసర్: గురుకుల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్న బతుకమ్మ, దసరా అలయ్ బలయ్, రావణ దహనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన చైతన్య సేవా సమితి వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ మాట్లాడుతూ... ఉత్సవాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, మెహిందీ కార్యక్రమం ఉంటుందన్నారు. మహిళలు ఆయా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, జన చైతన్య సేవా సమితి అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజర్ సురేశ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'స్వచ్ఛత హీ సేవా'


వస్తువులు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

ఘట్‌కేసర్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని టీజీ ఆర్టీసీ ఘట్‌కేసర్ బస్టాండ్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్ స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు నవీన్‌రెడ్డి, నాగ అయ్యప్ప, టీజీ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో భగత్ సింగ్ బ్రదర్స్ యూత్ అసోషియేషన్ నూతన కమిటీని సోమవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా పొట్ట మహేష్, ఉపాధ్యక్షులుగా చీర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చీర మహేష్, కోశాధికారిగా పొట్ట భాస్కర్, సభ్యులుగా పొట్ట శ్రీకాంత్, చిందం శివ, చిందం రవి, చీర కుమార్, రేగుశంకర్, రేగు నాగేష్, పొట్ట వెంకటేష్ ఎంపికయ్యారు.

విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకం


మర్రి అంజిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తారని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన మర్రి అంజిరెడ్డి సోమవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ పదవీవిరమణ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని వారి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతకు కట్టుబడి తమ జీవితకాలం మొత్తం పని చేస్తారన్నారు. అంజిరెడ్డి కిందస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ.. మేనేజర్ స్థాయిలో పదవీవిరమణ పొందారన్నారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, చీరాల నర్సింహ్మా, కొత్త చందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ. 7 కోట్లతో ఉప్పల్ డివిజన్ అభివృద్ధి

ఉప్పల్: డివిజన్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా రూ. 7 కోట్లు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సూర్యనగర్ కాలనీ, శ్రీరామ కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీ, శేష సాయినగర్, సాత్ స్వరూప్‌నగర్, కాలనీల్లో రూ. 2.08 కోట్లతో సీసీరోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. శేషసాయినగర్ ఉప్పల్ నల్ల చెరువు వరకు నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.1.95 కోట్లు, టీవీ కాలనీ శ్రీరమణపురం సీసీరోడ్ల నిర్మాణ పనులకు రూ. 90 లక్షలు, సత్యనగర్ కాలనీ, కమ్యూనిటీహాల్, సూర్యనగర్ కాలనీ సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 1.86 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

సర్కారు బడుల్లో...

'పర్యాటక క్లబ్బులు'!

ప్రభుత్వ బడుల్లో ఏర్పాటుపై విద్యాశాఖ ప్రణాళిక

- విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పనకు చర్యలు
- యువ టూరిజం పేరిట పాఠశాలల్లో క్లబ్‌లు
- ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్‌ల ఏర్పాటుపై విద్యాశాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించాలన్న సర్కారు ఆదేశాల నేపథ్యంలో విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. యువ టూరిజం పేరిట పాఠశాలల్లో క్లబ్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వీటిని నిర్వహించనున్నారు.

క్లబ్‌ల ఏర్పాటు ఇలా...

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో ఏడు నుంచి 12వ తరగతి వరకు

జిల్లా	ప్రభుత్వ బడులు	విద్యార్థుల సంఖ్య
మేడ్చల్–మల్కాజిగిరి	507	96,284
రంగారెడ్డి	1301	1,56,204

చదివే విద్యార్థులు ఉన్న చోట క్లబ్‌లలో సభ్యులుగా చేర్చుతారు. ఒక్కో క్లబ్‌కు ఒక విద్యార్థి బాధ్యత వహించనుండగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తారు. బడుల్లో ఆన్‌లైన్ ద్వారా సంబంధిత 'వైటీసీ.టూరిజంగొటెక్.ఇన్' వెబ్ సైట్ ద్వారా తమ బడుల వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటోంది. పర్యాటక క్లబ్ ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. విద్యార్థులతో తమ ప్రాంత పర్యాటక స్థలాలపై విస్తృత ప్రచారం చేయడానికి ఈ క్లబ్‌లు దోహదపడనున్నాయి.

చారిత్రక అంశాలపై అవగాహన పెంచేలా..

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక అంశాలపై పట్టు పెంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనునున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేసి దర్శనీయ స్థలాల సందర్శన చేయిస్తారు. సొంత ప్రాంతాల్లో ఉన్న చారిత్రక సంపదపై అవగాహన కల్పించేలా అన్ని విధాలుగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

పరిష్కార చర్యలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజా ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.

- ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులకు 63 ఫిర్యాదులు అందాయి. ఇందులో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు, ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, ఫారెస్టు భూముల ఆక్రమణలు, ఉపాధి కల్పతో పాటు వ్యక్తిగత సంబంధమైన ఫిర్యాదులు ఉన్నాయి. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్‌లో హిందీ దివస్


విజేతలకు ప్రశంసాపత్రం అందచేస్తున్న సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్‌మింజ్

జవహర్‌నగర్: హిందీ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో ఉద్యోగులకు హిందీ దివస్‌పై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఐజీపీ అనిల్‌మింజ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సంవత్సరం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హిందీ వర్క్‌షాప్, వ్యాపార పోటీలు, టైపింగ్, నాటింగ్, డ్రాఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనుల పర్యవేక్షణ



సాక్షి, సిటీబ్యూరో: అల్వాల్‌లో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణ పనులను సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వేణు గోపాల్, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శోభ, అల్వాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యాకేందర్ రెడ్డి ఉన్నారు. నిర్మాణ పనుల పురోగతి, ఆశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడడం, పురోగతిలో ఉన్న పనులను డీఎంహెచ్ఓ రఘునాథ్ సమీక్షించారు. నాణ్యత ప్రొటోకాల్‌లకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ ట్రాక్‌లో ఉందని నిర్ధారించడానికి, తదుపరి సవాళ్లను గుర్తించడానికి ఇంజినీరింగ్, వైద్య బృందాలతో ఆయన సమాలోచనలు జరిపారు.

అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు

- నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి
- ఉద్యోగ విరమణ చేసిన మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్
- ఘనంగా వీడ్కోలు పలికిన ఉద్యోగులు, నాయకులు


గజమాలతో రాజేంద్రకుమార్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కీసర: అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని... ప్రజలు వారిని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విమరణ పొందిన రాజేంద్రకుమార్ వీడ్కోలు, అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన చైర్మన్ మాట్లాడుతూ... 33 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగిగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన రాజేంద్రకుమార్ నాగారం మున్సిపల్ కమిషనర్‌గా 14 నెలలుగా ఎంతో మంచి, ఆదర్శవంతమైన సేవలు అందించారని కొనియాడారు. రాజేంద్రకుమార్ శేషజీవితం ప్రశాంతంగా గడపాలని ఆయన అభిలషించారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు రాజేంద్రకుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు గూడురు సబిత ఆంజనేయులుగౌడ్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కొకుట్ల అనంతరెడ్డి, సుర్వీ శ్రీనివాస్‌గౌడ్, కొకుట్ల మమతాకృష్ణారెడ్డి, నాగేష్‌గౌడ్, కళావతి, లక్ష్మీవేణుగోపాల్, పంగ హరిబాబు, కో ఆప్షన్ సభ్యులు క్యాసారం అశోక్‌గౌడ్, షఫీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'అట్రాసిటీ' బాధితులకు సత్వర న్యాయం అందాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినప్పుడు వాటికి అవసరమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పోలీసు శాఖను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు కానీ కేసుకు అవసరమైన సాక్ష్యాలను సరైన విధంగా సేకరించే విజయంలో జాప్యం జరుగుతోందన్నారు. కోర్టులలో బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవటంలో సమయం కేటాయించలేక పోతున్నదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్– పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ–పీవోఏ) చట్టాలను కచ్చితంగా అమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిని చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమాత్రం పెండింగ్‌లో ఉంచరాదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి, బాధితులకు న్యాయం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ కేసుల నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులతో ఆయన పేర్కొన్నారు. అట్రాసిటీ కేసుల్లో అవసరమైన కుల ధ్రువీకరణల జారీలో చాలా వరకు జాప్యం జరుగుతుందన్నారు. అలా కాకుండా వీలైనంత తొందరగా వాటిని జారీ చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత అధికారులు పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజిగిరి డీసీపీ కోటిరెడ్డి, బాలానగర్ డీసీపీ సురేష్., జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్లు వెంకటేష్, ధనరాజ్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ 5వ వార్డులోని లక్ష్మీనగర్‌లో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అందరి సహకారంతో మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులను చేపట్టి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం వద్ద స్వచ్ఛత హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది కోసం ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ ప్రారంభించారు. కౌన్సిలర్ కొత్త సురేఖ, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, ఈఎస్ఐ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి: విష్ణుపురికాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఆయన పలు కాలనీల్లో పర్యటించి నివాసాల వద్ద వేస్ట్ మెటీరియల్స్‌ను యజమానులు తొలగించాలని సూచించామన్నారు. రహదారుల వెంట ఉన్న గ్రీన్‌వేస్ట్, డెబ్రిస్‌లను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని సూచించామన్నారు. స్ట్రీట్‌లైట్ సమస్యను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ సత్యనారాయణను కోరామన్నారు. ఇంజినీరింగ్ విభాగం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కాలనీవాసులు శ్రీనివాస్ యాదవ్, నాగరాజ్, శర్మ, బాబునాయక్, బీటీనాయక్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి

ఉప్పల్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ కురుమానగర్, ఉప్పల్‌హిల్స్ ప్రాంతంలో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఉప్పల్ అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ హిల్స్‌లో రూ. 50 లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. దుర్గం నవీన్‌యాదవ్, అబ్బయ్య, తోటి శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, యాదగిరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మూసివేసిన రోడ్లను పునరుద్ధరించండి


మేడ్చల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీల నేతలు

మేడ్చల్: అత్వెల్లి పరిధిలోని లోటస్ వెంచర్‌లో మూసి వేసిన మూడు రోడ్లను ఓపెన్ చేయించాలని పట్టణంలోని రాఘవేంద్రనగర్, టీచర్స్ కాలనీ, గణేష్ గ్రీన్ పార్క్, బ్రాడ్ వే, విజేత విల్లాస్, వర్ధన్ సిటీ విల్లాస్ తదితర కాలనీల అసోసియేషన్‌ల సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌లకు సోమవారం వినతి పత్రాలను సమర్పించారు. మేడ్చల్ కోర్టు వెనుక భాగంలో ఉన్న దాదాపు 20 కాలనీలకు మేడ్చల్ కోర్టు పక్క నుంచి ఉన్న రహదారి ఒక్కటే ఉండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకొచ్చారు. కోర్టు అవతలి వైపు కాలనీల పై భాగాన ఉన్న లోటస్ వెంచర్ గ్రామ పంచాయతీ వెంచర్ అని దాంట్లో కాలనీలకు వచ్చే మూడు రోడ్లు మూసివేశారని తెలిపారు. ఆయా రోడ్లను తెరిపించి కాలనీల వాసుల రవాణా కష్టాలు తీర్చాలని కోరారు.

రైతును రాజు చేయడమే ధ్యేయం


మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట్: రైతును రాజును చేయడమే ధ్యేయంగా కృషి చేశామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, శామీర్‌పేట్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట్ వ్యవసాయ సహకార సంఘం 43వ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, కోఆపరేటివ్ జాయింట్ రిజిస్ట్రార్ సురేశ్, కృష్ణారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విలీన జీపీల్లో ఉద్యోగుల మెడకు ఉచ్చు..!

- జీపీల్లో పేరుకుపోయిన బకాయిలు రూ. 1.50 కోట్లు
- అత్యవసర సేవలకు వినియోగించినా ఖజానాలో జమ చేయాలని ఒత్తిడి

సాక్షి, సిటీబ్యూరో: శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 13 పురపాలికల్లో ఇటీవల విలీనమై 40 పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగుల మెడకు ఉచ్చు బిగుస్తోంది. పంచాయతీల్లో అత్యవసర సేవలకు ' క్యాష్ ఇన్ హ్యాండ్' ద్వారా వెచ్చించిన డబ్బులను తక్షణమే ఖజానకు జమ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు పెరగటంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఉద్యోగం కాపాడుకునేందుకు పంచాయతీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏడు పురపాలికల్లో విలీనమైన 28 పంచాయతీల్లో రూ. 1.50 కోట్లు 'క్యాష్ ఇన్ హ్యాండ్' ద్వారా కార్యదర్శులు అత్యవసర సేవలకు వినియోగించినట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లాలో 5 పురపాలికల్లో విలీనమై 12 పంచాయతీల్లో కూడా నెలకొని ఉంది. విలీనం కంటే ముందు వరకు పంచాయతీల్లో పూర్తి స్థాయి అధికారాన్ని కార్యదర్శులే చెలాయించారు. పురపాలికల్లో విలీనం తర్వాత కార్యదర్శుల హోదా తగ్గింది. విలీనం కంటే ముందు అన్నీ తామై వ్యవహరించిన కార్యదర్శులు కేవలం పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఫిర్యాదుల స్వీకరణ వరకు పరిమితమయ్యారు. ఇది చాలదన్నట్లు అత్యవసర సేవలకు ఖర్చు చేసిన డబ్బులు చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచటంతో చేసేదేమీ లేక వివిధ కారణాలతో సెలవుపై వెళ్లేందుకు కొందరు సిద్ధమవుతున్నారు.

బిల్లులు వచ్చాక...

విలీన గ్రామాల్లో అత్యవసర పనుల కోసం కార్యదర్శులు పంచాయతీ తీర్మానం, ఉన్నతాధికారుల ఆమోదంతోనే నిధులు ఖర్చు చేయగా, వీటికి సంబంధించిన బిల్లులు ఎస్టీఓల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఆబిల్లులు వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ ఖజానాకు మళ్లించుకోవచ్చని చెబుతున్నా.. ఉన్నతాధి కారులు పట్టించుకోవడంలేదని గ్రామ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు తగిన చర్యలతో విలీన పంచాయతీల కార్యదర్శులకు ఉపశమనం కల్పించాలని వారు కోరుతున్నారు.


నియామక పత్రం అందుకుంటున్న సురేష్

నియామకం

కీసర: గౌరైల కాపరుల సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా గోధుమకుంటకు చెందిన చీర సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి చేతుల మీదుగా సురేష్ అందుకున్నారు. మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, జిల్లా సెక్రటరీ తిరుమల్‌రెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాగుల అశోక్‌ముదిరాజ్, చంద్రశేఖర్‌గౌడ్, ఐలయ్యయాదవ్, కొలిచెలిమి కృష్ణ, నల్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.